క్లుప్తంగా

ప్రతిభా పరీక్ష విజేత బారువ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మందస: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బాలిగాం గ్రామంలో గురువారం జిల్లాస్థాయి ప్రతిభా పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో బారువ జట్టు మొదటి స్థానం దక్కించుకోగా.. ద్వితీయ, తృతీయ స్థానాలను గీతం హైస్కూల్, బొరివంక పాఠశాల నిలిచింది. మొత్తం 69 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలిగాం గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు దాసరి ఈశ్వరరావు, చమళ్ల జోగారావు, వల్లభ హరికృష్ణ, గున్న నారాయణరావు, గున్న మురళీ పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరు గ్రామంలో యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 50 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది ఎం.రాంబాబు మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అన్న మదర్ థెరిసా సూక్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలన్నారు. సమాజానికి ప్రజోపకరమైన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్య, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపీ, సత్యసాయి పాఠశాల చైర్మన్ సాహుకారి భానుతేజ, కోట రామారావు, చిన్ని బైరాగి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సర్పంచ్ గుజ్జ ఢిల్లీరావు అన్నారు. సన్యాసిపుట్టుగ, కేశుపురంలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. సన్యాసిపుట్టుగలో జరిగిన పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా గవర్నమెంట్ హైస్కూల్ (కవిటి), ఉన్నత పాఠశాల(బొరివంక), ప్రాథమికోన్నత పాఠశాల (సన్యాసిపుట్టుగ)జట్లకు, కేశుపురంలో జరిగిన పోటీల్లో జెడ్పీ హైస్కూల్ (బొరివంక), జెడ్పీ హైస్కూల్ (కుసుంపురం), జెడ్పీ హైస్కూల్ (మాణిక్యపురం) జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు బాగ జయపతి, బాగ మోహనరావు, ఉప సర్పంచ్ ఎస్.గోపి, బుడత ప్రకాశరావు, మాసుపత్రి వీరాస్వామి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

కంచిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసే చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ అన్నారు. గోకర్ణపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో చేకూరే లబ్ధిపై ప్రకృతి వ్యవసాయం డివిజనల్ యాంకర్ యశోద ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జీవామృతం తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ వల్లభరావు, ఐసీఆర్‌పీలు కామరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి మూడోవార్డు పెంటిభద్ర గిరిజన గ్రామంలో సంక్రాంతి సందర్భంగా కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. వార్డు కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు పోటీలు ప్రారంభించారు. పోటీల్లో ఆహ్వానిత గిరిజన జట్లు పాల్గొన్నాయి. కనుమ పండుగ వరకూ పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, బదకల బాలమ్మ, బదకల పులిరాజు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి

టెక్కలి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని టెక్కలి మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కోరారు. ఈ మేరకు గురువారం నిరసన చేపట్టారు. మూడు నెలల జీతాలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఇందిరా గాంధీ జంక్షన్ వద్ద చెత్త సేకరణ ట్రాక్టర్‌ను అడ్డుకుని అందులోని చెత్తను రోడ్డుపై పడేసి దాని ముందుకూర్చొని నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో టెక్కలి సీఐ చంద్రమౌళీ, ఎస్సై రామకృష్ణ, పంచాయతీ ఇన్‌చార్జి ఈవో శశిధర్ చేరుకొని కార్మికులతో మాట్లాడి వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.



నందిగాం: వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కవిటి: కొత్తకొజ్జీరియాలో వివేకానందస్వామి జయంతివేడుకలు



ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేటలో వివేకానందునికి నివాళులర్పిస్తూ..



కవిటి: దూగానపుట్టుగ జ్ఞానోదయకేంద్ర గ్రంథాలయంలో..

యువతకు ఆదర్శం వివేకానందుడు



టెక్కలి: యువతతో కలిసి ర్యాలీ చేస్తున్న టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి



సోంపేట: జింకిభద్రలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు



కోటబొమ్మాళి: వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ అప్పలస్వామి



టెక్కలి: ఆదిత్య కళాశాలలో వివేకానందునికి పూలమాల వేస్తున్న సిబ్బంది

- టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానందా జయంతి కార్యక్రమాన్ని రామకృష్ణ సేవా సమితి, వివేకానందా యువజన సంఘం ఆధ్వర్యంలో టెక్కలిలోని పాలకేంద్రం సమీపంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ వివేకానందా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యువతతో కలిసి ర్యాలీ చేశారు. అలాగే టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు తదితరులు వివేకానందా విగ్రహానికి నివాళులర్పించారు. ఏబీవీపీ నాయకులు కె.మురళి, నవీన్, తులసీ తదితరులు ఆధ్వర్యంలో వివేకానందా విగ్రహానికి నివాళులర్పించారు. టెక్కలి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోటబొమ్మాళి: చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో వివేకానంద 160వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వివేకానంద దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారని పలువురు వక్తలు కొనియాడారు. సర్పంచ్ నేతింటి అప్పలస్వామి, మండల హిందూధర్మ ప్రచార కార్యదర్శి ననసల కరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సోంపేట: స్వామి వివేకనందా జయంతి కార్యక్రమాలు మండల వ్యాప్తంగా జరిగాయి. జింకిభద్రలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్ పాల్గొని వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రామకృష్ణాసేవాసమితి, వియ్‌ఫర్‌యూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కూడా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు డి.జోగారావు, జి.శంకరరావు, ఎం.ఈశ్వరరావు, ధర్మారావు పాల్గొన్నారు.

కవిటి: బెజ్జిపుట్టుగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వివేకానందుని జయంతి కార్యక్రమం జరిగింది. కవిటి ఎంఈవో ధనంజయమజ్జి పాల్గొని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అలాగే కవిటిలోని ఉషోదయ సంఘ భవనం, కొత్తకొజ్జీరియా ఉన్నతపాఠశాలతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేట పాఠశాలలు, దూగానపుట్టుగ జ్ఞానోదయకేంద్ర గ్రంథాలయంలో కార్యక్రమాలు జరిగాయి.

కంచిలి: యువత స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానందుడని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పెద్దకొజ్జిరియాలో నిర్వహించిన స్వామి వివేకానందుని జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. పాఠశాల ఆవరణలోని వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కంచిలి పంచాయతీ పరిధిలోని చెత్తతో సంపద కేంద్రం ఆవరణలోని వివేకానందుని విగ్రహానికి సోంపేటకు చెందిన రామక్రిష్ణ సేవా సమితి, వి ఫర్ యూ సంస్థల సభ్యులు పూనా శ్రీకాంత్ పూలమాల వేసి నివాళులర్పించారు.



ఇచ్ఛాపురం రూరల్: ముచ్చింద్రలో వివేకానందుని వేషధారణలో విద్యార్థి

ఇచ్ఛాపురం రూరల్: స్వామి వివేకానంద సూక్తులు, బోధనలు నేటి యువతకు ఆదర్శమని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం డొంకూరులో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ధర్మపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విశ్వనాథం, ఇన్నేశుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.శంకరం, ముచ్చింద్ర పాఠశాలలో హెచ్‌ఎం కొత్తపల్లి సుహాష్‌చంద్‌లు వివేకానందుని చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడ్డ ముఖలింగం, ఉప సర్పంచ్ దున్న జానకీరావు, మాజీ సర్పంచ్ దున్న లోకేష్, బుడ్డ ఋషి, దున్న కూర్మారావు పాల్గొన్నారు.



సోంపేట: స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో రామకృష్ణాసేవా సమితి, వియ్‌ఫర్‌యూ సభ్యులు

నందిగాం: కాపుతెంబూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో యువజన దినోత్సవం జరిగింది. స్వామి వివేకానంద విగ్రహానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఆసపన్న మధుబాబు, సర్పంచ్ పోలాకి మోహనరావు నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, విద్యాకమిటీ చైర్మన్ పోలాకి నూకరాజు, హెచ్‌ఎం రామారావు, క్రిష్ణవేణి, లీలావతి, ఒంకార్ పాల్గొన్నారు.

ముందస్తు సంబరం అదరహో..



కవిటి: గంగిరెద్దు కళాకారుల వేషధారణలో బీవీకే విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: బలరాంపురం పాఠశాలలో విద్యార్థుల సందడి



ఇచ్ఛాపురం: బాలికోన్నత పాఠశాలలో ముగ్గులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆనందాన్ని ఇచ్చాయి. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గంగిరెద్దులు, హరిదాసు కళాకారుల వేషధారణలతో మగపిల్లలు అలరించగా.. సంప్రదాయ వస్త్రధారణతో ఆడపిల్లలు ఆకట్టుకున్నారు. రంగురంగుల ముగ్గులు వేశారు. భోగిమంటలను వేసి వెచ్చదనాన్ని ఆశ్వాదించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగుల ప్రాధాన్యతను ఉపాధ్యాయులు పిల్లలకు వివరించారు. ఇచ్ఛాపురం పురపాలక బాలికోన్నత పాఠశాల ఆవరణలో సంతూర్ బ్రాండ్ వారి సౌజన్యంతో నిర్వహించిన ముగుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ బహుమతులు ప్రదానం చేశారు.



కవిటి: భోగిమంట వేస్తున్న విద్యార్థులు

సముద్రపు కలుపు మొక్కల పెంపకంతో ఆదాయం



మత్స్యసంపద యోజన పథకం ప్రారంభంలో నాయకులు

సోంపేట: సముద్రపు కలుపు మొక్కల పెంపకంతో అధిక ఆదాయం చేకూరుతోందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. బారువ మేజర్ పంచాయతీ కొత్తూరు గ్రామంలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజక పథకంలో భాగంగా సముద్ర కలుపు మొక్కల పెంపకాన్ని గురువారం ఎంపీపీ దాస్, జెడ్పీటీసీ సభ్యుడు తడక యశోదలు మత్స్యశాఖాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశ పెడుతునాయన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చారన్నారు. కలుపు మొక్కలు మత్స్యసంపదకు ఆహారంగా ఉపయోగపడి ఉత్పత్తి పెరుగుతుందన్నారు. సముద్రపు కలుపు మొక్కలు ఔషధాలుగా ఉపయోగపడుతాయన్నారు. మత్స్యకారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడిఈ సంతోష్,మత్స్యకార కార్పోరేషన్ డైరెక్టర్ మద్దురాజారావు,మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు,బారువ సర్పంచ్ యర్ర రజనీ,ఉపసర్పంచ్ పి.రాజు, ఈఓపిఆర్డీ టి.వాసుదేవు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై చైతన్యం కావాలి

- సీనియర్ సివిల్ జడ్జి హరిత



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి హరిత

టెక్కలి: రోడ్డు ప్రమాదాల నియంత్రణపై మరింత చైతన్యం కావాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత అన్నారు. రహదారి భద్రతపై ప్రజా రవాణా, ట్యాక్సీ డ్రైవర్లకు టెక్కలి ప్రజా రవాణా డిపోలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనానికి సంబంధించి అన్ని రకాల పత్రాలు ఉన్న వారు పోలీసుల నుంచి ఎటువంటి భయందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సామాన్యుల పరిరక్షణ కోసమే చట్టాలు ఉన్నాయని వెల్లడించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందజేస్తున్న న్యాయ విజ్ఞాన సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రవాణా శాఖా ఉప కమిషనర్ శ్రీదేవి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై విద్యార్థులకు ప్రత్యేక చైతన్యం కల్పించాలన్నారు. టెక్కలి ఎంవీఐ డి.సంజీవరావు, రోడ్డు సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, సీఐ చంద్రమౌళి, ఎస్సై రామకృష్ణ, డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ చంద్రమౌళి

టెక్కలి: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని టెక్కలి సీఐ చంద్రమౌళి అన్నారు. డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన వాలీబాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు మెమెంటో, నగదు బహుమతులను సీఐ అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాలను టెక్కలి అంబేద్కర్ వీధికి చెందిన జట్లు, మూడో స్థానాన్ని టెక్కలి గ్రౌండ్ టీమ్ దక్కించుకున్నాయి. కోటబొమ్మాళి మండలం చుట్టిగుండాం గ్రామానికి చెందిన జట్టుకు ప్రత్యేక బహుమతి అందజేశారు. పోటీల నిర్వాహణకు సహకరించిన పీడీలు రాజేష్, రఘునాథరావు, జె.జె.రెడ్డి, శ్యామ్ తదితరులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎస్.షణ్ముఖరావు, విద్యార్థి సంఘం నాయకుడు కె.గణేష్, ఎం.శివ, సాయి, సంతోష్, షణ్ముఖ, యు.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఆదినారాయణను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నందిగాం: నందిగాం ఉన్నత పాఠశాలలో 1990–1995 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. చదువుకున్న రోజులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అప్పటి హిందీ పండితుడు జినణ ఆదినారాయణను సత్కరించి గౌరవించారు.

కంచమ్మ అమ్మవారికి పూజలు



పూజలు చేస్తున్న లక్ష్మీనారాయణ

కంచిలి: స్థానిక కంచమ్మతల్లి అమ్మవారిని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అతనితో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు జగదీష్ పట్నాయక్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి, దండుగోపాలపురం పీహెచ్‌సీలను డీఎంహెచ్‌వో బి.మీనాక్షి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ఐరన్ మాత్రలు సక్రమంగా అందించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి రోజుకు మూడుసార్లు ముఖ చిత్రం హాజరు వేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా అయ్యేటట్లు చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, అజయ్‌కుమార్ ఉన్నారు.

నిరుపేదలకు సాయం



వలియాసాగరం గ్రామంలో సాయం అందజేస్తున్న సభ్యులు

టెక్కలి: స్వామి వివేకానందా జయంతి సందర్భంగా పట్టణానికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం పలువురు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. వలియాసాగరం గ్రామానికి చెందిన పొన్నాడ చైతన్య కుటుంబానికి రూ. 6 వేలతో పాటు నిత్యావసర సరుకులు, టెక్కలి కొండ్రవీధికి చెందిన శివకోటి కాళీ కుటుంబానికి రూ.2 వేలు.. సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు డి.శ్రీనివాసరావు, శ్రీనివాస్ బెహర, ఎస్.సింహాచలం, డి.పూర్ణాచారి, ఎ.వీరభద్రం, వి.శివ, డి.శ్రీనివాస్, జె.ఆదినారాయణ, బి.చంద్రకాంత్ పాల్గొన్నారు.

దంతలో డీసీసీబీ ఏటీఎం ప్రారంభం

కోటబొమ్మాళి: దంతలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కోటబొమ్మాళి శాఖ ఆధ్వర్యంలో ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని స్థానిక సర్పంచ్ గొండు చాంధిని గురువారం ప్రారంభించారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ వ్యక్తిగత సహాయకుడు, దంత గ్రామానికి చెందిన గొండు మురళీ తన సొంతస్థలాన్ని కేటాయించి ఏటీఎం ఏర్పాటుకు కృషి చేసినట్లు డీసీసీబీ మేనేజర్ డి.వి.రమణ తెలిపారు.

భూసర్వే ఆధారంగా పన్ను వసూలు

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల్లో ఇకపై శాశ్వత భూసర్వే ఆధారంగానే ఇంటి పన్ను వసూళ్లు చేయాల్సి ఉంటుందని మండల ఈఓపీఆర్‌డీ తులా రాజారావు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ఇప్పటివరకూ భూసర్వే పూర్తయిన ఆనందపురం, జియ్యన్నపేట, రేగులపాడు, సరియాపల్లి, కన్నేవలస, చిన్నసాన గ్రామాల్లో భూసర్వే ప్రకారం ఇంటి విస్తీర్ణం గుర్తించి పన్ను వసూలు చేయాలన్నారు.

సంక్షిప్తంగా..


మొక్కలను సంరక్షించాలి



మొక్కను నాటుతున్న గద్దర్

పలాస: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటి..వాటిని సంరక్షించాలని ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. సిక్కోలు జానపద కళాజాతరకు వచ్చిన ఆయన పలాసకు చెందిన గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ ఇచ్చిన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలే మనిషికి జీవనాధారమని, మొక్కలను పూజించి కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బోనెల గోపాల్‌తో పాటు కార్యదర్శి బీటీ రావు, నూకల హేమసుందర్, సినీనటుడు అమ్మ రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల అందజేత



దుస్తులను అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులకు దాతలు దుస్తులను వితరణ చేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని పలాస–కాశీబుగ్గ లైన్స్‌క్లబ్ ఆఫ్ కాష్యూ లాండ్ ఆఫ్ వనిత విభాగం ఆధ్వర్యంలో 42 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ బళ్ల గిరిబాబు, సతీమణి ఉషారాణి చేతుల మీదుగా దుస్తులను అందజేశారు.

క్విజ్ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



నగదు బహుమతిని అందజేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

వజ్రపుకొత్తూరు: హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను గురువారం ప్రదానం చేశారు. పల్లివూరు సర్పంచ్ మామిడి భాస్కరరావు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొదటి బహుమతిగా చిన్నబాడాం సాయి శిరీష పాఠశాల విద్యార్థులకు రూ. 5 వేలు, గోవిందపురం హైస్కూల్‌కు ద్వితీయ బహుమతిగా రూ. మూడు వేలు, మూడో స్థానంలో నిలిచిన హుకుంపేట హైస్కూల్ విద్యార్థులకు రూ. 2 వేలుతో పాటు షీల్డును అందజేశారు. ఉపాధ్యాయులు రాంబాబు, ఉమారావు పాల్గొన్నారు.

పండుగ వేళ అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి రూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీఐ చంద్రమౌళీ సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగ జరుపుకోవడానికి సొంతఊర్లకు వెళ్లేవాళ్లు తమ విలువైన వస్తువులను వెంట తీసుకొని వెళ్లాలన్నారు. పోలీసులకు సమాచారం ఇస్తే సిబ్బందితో నిఘా పెడతామన్నారు.